క్లుప్తంగా

పోలీసు కవాతు



మండలంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చిన్నమండెం : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండలంలో ఎస్‌ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీలోని శ్రీరాంనగర్‌కాలనీ, శ్రీనివాసపురం, బోరెడ్డిగారిపల్లె, కలిబండ గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామాల్లో కేంద్ర బలగాలు మండలాల్లో ఉన్నాయని కవాతు నిర్వహించినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



తాగునీరు అందిస్తున్న సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి

సిద్దవటం : నేకనాపురం గ్రామ పంచాయతీ సిద్దవటం – భాకరాపేటకు వెళ్లే ప్రధాన రహదారిలోని మర్రిచెట్టు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నేకనాపురం సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రగా ఉండటంతో ద్విచక్రవాహనాల్లో వెళ్లే ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇక్కడ చలివేంద్రంను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'టీడీపీలో చేరిన వారు వైఎస్‌ఆర్‌సీపీ కాదు'



పల్లె సుబ్బరామిరెడ్డి

సిద్దవటం : సిద్దవటం మండలం నుంచి సోమవారం నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరిన వారందరూ వైఎస్‌ఆర్‌సీపీ కాదని, వైఎస్‌ఆర్‌సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి పల్లె సుబ్బరామిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ టీడీపీలో చేరిన వారంతా 2019 వరకు టిడిపీలోనే ఉన్నారని, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి వెంట వైఎస్‌ఆర్‌సీపీలోకి వచ్చారన్నారు. ఇక్కడ ఈ ఐదు సంవత్సరాలు మండల స్థాయిలో పదవులు అనుభవించి, లబ్ధి పొంది తిరిగి వారు టీడీపీలో చేరారన్నారు. సిద్దవటం మండలంలో వైఎస్‌ఆర్‌సీపీకి ఉన్న క్యాడర్ దెబ్బతినలేదని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రెడ్లను విమర్శించడం సీఎం రమేష్‌కు తగదు



సింగం క్రిష్ణారెడ్డి

సిద్దవటం : రెడ్లను తొక్కి నార తీస్తామంటూ విమర్శించడం సీఎం రమేష్‌కు తగదని సిద్దవటం మండలం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సింగం క్రిష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రెడ్లు అన్నీ పార్టీలలో ఉన్నారని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారి మన్నలను పొంది ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందడం జరుగుతుందన్నారు. అయితే సీఎం రమేష్ దొడ్డిదారిన పదవులను పొందారన్నారు. కులపిచ్చి సీఎం రమేష్‌కు అధికమన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న ఇలాంటి వారిని అన్ని వర్గాల ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని తెలియజేశారు.

ఆంజనేయస్వామికి పూజలు



ప్రత్యేక అలంకారంలో అభయాంజనేయుడు

పుల్లంపేట : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల పరిధిలోని కోటగడ్డపై వెలసిన శ్రీ అభయాంజనేయస్వామికి పూజారి శివశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకొని కాయాకర్పూరం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం దాతలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉగాది పర్వదినం రోజున స్వామివారిని దర్శించుకోవడం తమ పూర్వజన్మ సుకృతమని భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

కిటకిటలాడిన ఆలయాలు

కలికిరి: తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉగాదిని పురస్కరించుకుని కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. సోమేశ్వరాలయంలో అర్చకులు రామచంద్రశాస్త్రి, శివకుమార్‌శాస్త్రిలు ఉగాది పంచాంగం పఠనం చేశారు. సాయిబాబా, ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ భక్తులు పూజలు నిర్వహించారు.

సంతోషాలు, సిరి సంపదలు వెల్లివిరియాలి

- ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు
- సమగ్రాభివృద్ధి కోసం వైఎస్ జగన్‌ను గెలిపించుకుందాం
- పంచాంగ శ్రవణం, కొండయ్యగారిపల్లె గ్రామస్తులతో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు సమావేశం



వేదపండితుల ఆశీర్వాదం తీసుకుంటున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



గ్రామస్తులతో సమావేశంలో మాట్లాడుతున్న కొరముట్ల

రైల్వేకోడూరు : శ్రీ క్రోధి నామ సంవత్సరం ప్రజలందరికీ శుభాలు అందించాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆకాంక్షించారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి ఉజ్వల భవిష్యత్తుకు, తద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఈ ఏడాది దోహదపడాలన్నారు. అలానే ఈ ఏడాది వానలు సంవృద్ధిగా కురిసి రైతులకు మేలు కలగాలని, అన్ని వృత్తులు, వ్యాపార వర్గాల వారికి ఆశాజనకంగా ఉండి, ప్రతి ఇంటా సిరి సంపదలు, సంతోషాలు వెల్లివిరియాలని అభిలాషించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాధించిన ప్రగతి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఉగాది పచ్చడిని కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమనవర్మ, ఏపీటీడీసీ డైరెక్టర్లు సాయికిషోర్‌రెడ్డి, మండల నాగేంద్రలు, ముజీబ్, ఉప సర్పంచ్ తోట శివసాయి, గునిశెట్టి ప్రశాంతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మెజార్టీతో గెలిపించాలి

రైల్వేకోడూరు అర్బన్ : రాజంపేట పార్లమెంటరీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని వీపీఆర్ కండ్రిగ పంచాయతీలోని కొండయ్యగారిపల్లె గ్రామంలో పలు అంశాలపై గ్రామస్తులతో సమావేశమై ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ ఫలాలు ప్రతి కుటుంబానికి చేరాయన్నారు. పేదల మోహంలో చిరునవ్వు చూడటానికి జగనన్న అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. ముఖ్యంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎన్నో సంవత్సరాలుగా గత ప్రభుత్వాలు పట్టించుకోని సమస్యలను తమ ప్రభుత్వం వచ్చాకే పూర్తి చేశామన్నారు. ఇంకా అభివృద్ధి సాధించి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలంటే ప్రతి ఒక్కరూ జగనన్నకు తోడుగా నిలిచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సుధాకర్‌రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, సుదర్శన్‌రాజు, ముక్కా బాలిరెడ్డి, శివకుమార్, శివరామ్, అమర్, చంద్రశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా బీర్లు విక్రయం..

ఒంటిమిట్ట : మండల పరిధిలోని పెన్నపేరూరు గ్రామ పరిసరాలలో మంగళవారం అక్రమంగా 11 బీరు బాటిళ్లను విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని పెన్నపేరూరు గ్రామ పరిసర ప్రాంతంలో అక్రమంగా 11 బీరు సీసాలను విక్రయిస్తుండగా ఫ్లయింగ్ సాఫ్క్ ఇంచార్జ్ షిఫ్ట్ – 2గా పనిచేస్తున్న కుమార రంగయ్య గమనించి వారి పట్టుకుని పంచనామ రాసి, స్థానిక పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వారిలో పెన్నపేరూరుకు చెందిన నల్లా నాగేంద్ర, గంగపేరూరుకు చెందిన పల్లెం బాలక్రిష్ణ ఉన్నారు.

మేకపోతులు కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు

ఒంటిమిట్ట : మండల కేంద్రం పరిధిలోని చెంచుగారిపల్లెలో మేకపోతులు కనిపించలేదని మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. వివరాలలోకి వెళితే చెంచుగారిపల్లెకు చెందిన చింగారపు చిన్నవెంకట సుబ్బారెడ్డి, శివనాగేంద్రలకు చెందిన చెరో రెండు మేకపోతులు కొన్ని రోజుల క్రితం కనిపించకుండా పోవడంతో ఒంటిమిట్ట గ్రామ పరిసర ప్రాంతాలలో వెతికినా జాడ కనబడలేదు. దీంతో వారు పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా మంచాలమ్మ తిరునాల



మంచాలమ్మను దర్శించుకున్న ఆకేపాటి



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ



ప్రత్యేక అలంకరణలో మంచాలమ్మ

నందలూరు(రాజంపేట) : మండలంలోని ఆడపూరు గ్రామంలో వెలసిన శ్రీ మంచాలమ్మ తల్లి తిరునాల గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజంపేట శాసనసభ అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని మంచాలమ్మను సుందరంగా అలంకరించారు. ఈ ఉత్సవానికి కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు హాజరు కావడం విశేషం. ఈ నేపథ్యంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి ప్రారంభించారు. సాయంత్రం అమ్మవారికి మహిళలు పెద్దఎత్తున పొంగళ్లను సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కోదండ రామస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



పూజలందుకుంటున్న శ్రీ కోదండరాముడు

రామాపురం : శ్రీ కోదండ రామస్వామి కల్యాణోత్సవాలు ఉగాది పర్వదినాన ప్రారంభమయ్యాయి. మండలంలోని నీలకంఠ్రావుపేటలో వెలసిన కోదండ రామాలయంలో హనుమత్సమేత సీతారామలక్ష్మణ స్వాములకు మంగళవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు, అలంకరణలతో ప్రారంభమయ్యాయి. ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు ప్రతి రోజు పూజలు ఉభయాలు నిర్వహిస్తారు. శ్రీరామనవమి రోజున ఆలయంలో ఉదయం శ్రీ సీతారాముల కల్యాణోత్సవం, రాత్రికి గ్రామోత్సవం నిర్వహిస్తారు.

ఘనంగా శ్రీ క్రోధి నామ సంవత్సరాది ఉగాది వేడుకలు



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

మండలంలో నూతన తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను హిందువులు సాంప్రదాయ పూర్వకంగా మంగళవారం గ్రామాలలో జరుపుకున్నారు. ఉదయం తలంటు స్నానాల చేసి, నూతన వస్త్రాలు ధరించి ఆలయాల్లో పూజల్లో పాల్గొన్నారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని ఆరగించి పంచాంగ శ్రావణం పురోహితులచే చదవగా సంవత్సరం ఫలితాలు తెలుసుకున్నారు. పండుగ రోజున పిండివంటలను ఆరగించారు. మండలంలోని పల గ్రామాలలో ఆలయాలలోని దేవతమూర్తులను పరిశుద్ధం చేసి విద్యుత్‌దీపాలతో అలంకరించారు. సుద్దమళ్ల గ్రామం ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో తొగట వీరక్షత్రియులకు సంబంధించి చౌడేశ్వరదేవి ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేయించారు. హరిహరాలయంలో పూజల అనంతరం పంచాంగ శ్రావణ కార్యక్రమాలు పలువురు పాల్గొనడం విశేషం.

సంఘ్ సేవలు విస్తరింపచేస్తాం

పీలేరు : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) సేవలు విస్తరింపచేస్తామని రిటైర్డ్ ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పీలేరులోని పీఎల్‌ఆర్ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో పీలేరు, తలపుల, రేగళ్లు, కలకడ, కేవీపల్లె గ్రామీణ ఖండల తరుణ గణవేష్‌దారి స్వయంసేవకులతో ఉగాది ఉత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



వృద్ధురాలి పలుకరిస్తున్న ఆకేపాటి సాయిభరత్‌రెడ్డి

నందలూరు(రాజంపేట) : అర్హులైన ప్రతి పేదవాడికి పార్టీలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, అలాంటి వ్యక్తిని తిరిగి సీఎంను చేసుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి తనయుడు ఆకేపాటి సాయిభరత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం టంగుటూరు గ్రామ పంచాయతీ పరిధిలోని గట్టుమీదపల్లి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాఘవరెడ్డి ఆధ్వర్యంలో సాయి భరత్‌రెడ్డి ముమ్మర ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, అసెంబ్లీ అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రజలలో ఆకేపాటి అమరనాథరెడ్డి చేసినటువంటి కంటి ఆపరేషన్లు ద్వారా చూపు పొందినటువంటి వారు ఆయన వలనే తమకు చూపు వచ్చిందని, మేమంతా ఆయనకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు భువనబోయిన భాస్కర్ యాదవ్, హరినాథ్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, శ్రీను, నాగరాజు, కొండయ్య, బాలనరసింహులు, మల్లికార్జున, శ్రీనాథ్, చిన్నయ్య పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ ఓబన్న

సిద్దవటం : ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సిద్దవటం ఎస్‌ఐ పెద్ద ఓబన్న తెలిపారు. సిద్దవటం మండలంలోని మూలపల్లె గ్రామంలో మంగళవారం సాయంత్రం పల్లె దర్శిని కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజలు, నాయకులు, అధికారులు ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు కట్టుబడి ఉండాలన్నారు. ఎవరు కూడా రూ. 50వేలు నుంచి నగదును తీసుకెళ్లరాదని అలా తీసుకెళ్లాలంటే వాటికి తగిన పత్రాలను చూపించాల్సి ఉంటుందన్నారు. లేనిపక్షంలో నగదును సీజ్ చేస్తామన్నారు. సామాజిక, మాధ్యమాలను వేదిక చేసుకొని వ్యక్తి గతంగా కానీ, రాజకీయంగా కానీ, విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరగాలని, ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఏ ఒక్కరూ పాల్పడవద్దని ప్రజలను ఎస్‌ఐ హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు, మూలపల్లె గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలకు ఈద్గాలు ముస్తాబు



రంజాన్ ప్రార్థనలకు ముస్తాబైన బ్రాహ్మణపల్లె వద్ద ఉన్న ఈద్గా

రాజంపేట టౌన్: ఈనెల 11వ తేదీ జరగనున్న రంజాన్ పండుగ కోసం మండలంలోని ఈద్గాలు ముస్తాబయ్యాయి. పవిత్ర రంజాన్ మాసం బుధవారంతో ముగియనుంది. 30 రోజులపాటు కఠోర నియమ, నిష్టలతో ఉపవాసాలు ఆధ్యాత్మికంగా గడిపిన ముస్లింలు గురువారం రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసుకునేందుకు మండలంలోని అన్ని ఈద్గాలు ముస్తాబయ్యాయి. ఆయా ఈద్గా కమిటీ ప్రతినిధులు గత మూడు రోజులుగా ప్రత్యేక ప్రార్థనల కోసం అవసరమయ్యే ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు.

పండుగకు సర్వం సిద్ధం

రంజాన్ పండుగను ఘనంగా జరుపుకునేందుకు ముస్లింలు సర్వం సిద్ధం చేసుకొని నెలవంక దర్శనం కోసం ఎదురుచూస్తున్నారు. నెలవంక బుధవారం కనిపించే అవకాశం ఉండటంతో గురువారం పండుగను చేసుకోనున్నారు. ఇప్పటికే అనేక మంది ముస్లింలు రంజాన్ షాపింగ్ పూర్తి చేశారు. ఇక పండుగ రోజు వంటలు చేసుకునేందుకు అవసరమయ్యే సరుకులు వంటివి కొనుగోలు చేసేందుకు మంగళవారం ముస్లింలు పెద్దఎత్తున పట్టణానికి వచ్చారు. దీంతో మార్కెట్‌కు రంజాన్ శోభసంతరించుకుంది.

ఈద్గాలలో చేపట్టనున్న ప్రత్యేక ప్రార్థనల సమయాలు

పట్టణంలోని పాత ఈద్గాలో	7:30
మన్నూరు ఈద్గాలో	7:30
బ్రాహ్మణపల్లె ఈద్గాలో	8:00
పోలి ద్వారకానగర్ ఈద్గాలో	8:30
పోలి అప్పారాజుపేట ఈద్గాలో	8:30
రహమతీయ మసీదులో	8:30

స్వార్థపరులు వెళ్లినంత మాత్రాన నష్టంలేదు



మాట్లాడుతున్న ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి

రాజంపేట టౌన్ : ఇటీవల నారా లోకేష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిన వారు ఒకప్పటి తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులేనని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, శ్రీశైలం దేవస్థానం బోర్డు మెంబర్ పొల్లినేని రామ్మోహన్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబునాయుడు కోసం పచ్చపత్రికలు తాపత్రయపడటం చూస్తుంటే జాలేస్తుందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు అంటూ పచ్చపత్రికలు రాసిన వార్తల్లో ఏమాత్రం నిజం లేదన్నారు. ప్రస్తుతం టీడీపీలో చేరినవారంతా 2019వ సంవత్సరానికి ముందు తెలుగుదేశం పార్టీలో ఉన్నవారే అన్న విషయాన్ని పచ్చపత్రికలకు కనిపించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పుడు టీడీపీలో చేరిన వారు 2019వ సంవత్సరంలో వాళ్ల స్వార్థం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఇప్పుడు మళ్లీ వాళ్ల వ్యక్తిగత స్వార్థం కోసం తెలుగుదేశం పార్టీలోకి వెళ్లారన్నారు. వాళ్ల వల్ల తమ పార్టీకి ఆవగింజంత కూడా నష్టం లేదన్నారు. పార్టీ వీడిన వారు ఒక్క ఓటును కూడా ప్రభావితం చేయలేరని చెప్పారు. సొంత పార్టీలోకి వెళితే పచ్చపత్రికలు ఒకడుగు ముందుకు వేసి అత్యుత్సాహంతో రాజంపేటలో వైఎస్సార్‌సీపీ ఖాళీ అని కూడా రాయడం పచ్చమీడియా పిచ్చికి పరాకాష్ట అని దుయ్యబట్టారు. రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పునాదులు ఎవరు కదిలించలేనంత బలంగా ఉన్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని, అందువల్ల జగన్ ప్రజల గుండెల్లో ఉన్నారని తెలిపారు. తమ పార్టీ ఓటర్లను, ప్రజలను వైఎస్సార్‌సీపీకి దూరం చేసే అంతటి నాయకుడు రాజంపేట నియోజకవర్గంలోనే లేడన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చరిత్ర తిరగరాసే విజయాన్ని సాధిస్తారని వారు ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పచ్చపత్రికలు చంద్రబాబునాయుడును జాకీలు వేసి లేపే కార్యక్రమాన్ని విరమించుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తంబా సుబ్రమణ్యం, రాజంపేట, నందలూరు, వీరబల్లి మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు



ఓబులవారిపల్లె: పూజలందుకుంటున్న ఏక వీరమ్మ



గాలివీడు: పంచాంగ పఠనం చేస్తున్న వేద పండితుడు

రాజంపేట టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం ఉగాది వేడుకలను హిందువులు ఘనంగా నిర్వహించుకున్నారు. దాదాపు అన్ని దేవాలయాల్లో విశేషంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లోని ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించారు. కాగా పట్టణంలో ఆర్‌డీఓ కార్యాలయం సమీపంలో ఉన్న కసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి నగర్‌లో వెలసిన వరసిద్ధి వినాయక స్వామి తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఆంజనేయ స్వామి ఆలయంలో టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీటీడీ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ టి.గోపిబాబు, ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ, వీహెచ్‌పీ నాయకులు కాకర్ల రాముడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలను పురస్కరించుకొని ఆలయ వేదపండితులు హరినాథశర్మ భక్తులకు పంచాంగ శ్రవణం వినిపించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.

గ్రామాల్లో వేడుకగా ఉగాది

లక్కిరెడ్డిపల్లె : తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ అని, రైతులు, ప్రజలు ఈ ఏడాది పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్యలు మంగళవారం పేర్కొన్నారు. బుధవారం శ్రీ క్రోధినామ తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకొని ఎంపీపీ, మాజీ ఎంపీపీలకు నాయకులు, కార్యకర్తలు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామాలలో మహిళలు ఇంటి ముంగిట కల్లాపు చల్లి రంగవల్లులతో, పిండి వంటలతో ఉగాది పర్వదినాన్ని అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మారుమూల పల్లెల్లో యువత క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. టెంకాయ పందెలు ఉత్సాహంగా నిర్వహించారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : మండల వ్యాప్తంగా శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా ఆలయాలు మంగళవారం కిటకిటలాడాయి. ప్రజలు పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముక్కవారిపల్లి పంచాయతీ, కొర్లకుంట గ్రామంలోని ఉప్పలపాటి గంగమ్మ జాతరను కనుల పండుగగా జరిపారు. పెద్దఎత్తున ఇతర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భారీగా ఏర్పాటు చేసిన దుకాణాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మండల కేంద్రంలోని జె.వడ్డిపల్లి గ్రామంలోని గ్రామ దేవత ఏకవీరమ్మకు గ్రామస్తులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు, పొంగుబాళ్లు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

గాలివీడులో..

గాలివీడు : శ్రీ క్రోధినామ తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు ప్రజల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గేటు వద్ద ఉన్న శ్రీ కోదండ రామాలయంలో నాగఫణి కిషోర్ శర్మ పంచాంగ పఠనం గావించారు. పెద్దూరు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు గండిమడుగు తదితర ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం ఉగాది పర్వదినం వ్యవసాయ సంవత్సరంగా పరిగణించే ఈ ఉగాది నవ వసంతంలో రైతులకు, మేలు కలగాలని, ప్రజలందరి, కొత్త ఆశయాలు నెరవేరి సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఉగాది రోజున చేసుకునే షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి జీవితంలో అనేక అనుభవాలకు ప్రతీకని, జీవితంలో ఎదురయ్యే అనేక పరిస్థితులను ఎదుర్కొని ముందుకు వెళ్లాలని ఇది సూచిస్తుందని పేర్కొన్నారు.



రాజంపేట టౌన్: పూజలందుకున్న వినాయకుడు